క్లుప్తంగా

రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా రావాడ



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపక సిబ్బంది

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంతవరకు సూపర్ న్యూమరీ పోస్టులో ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న రావాడ సత్యనారాయణకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల అధ్యపక సిబ్బంది ఆయన్ను అభినందిస్తూ కళాశాలలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ప్రవేశాల సంఖ్య, వసతులు మెరుగుపర్చేందుకు, కళాశాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



చేతిపంపును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు

గుర్ల: మండలంలోని ఆనందపురం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, డీఎల్‌డీఏ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు బుధవారం ప్రారంభించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగినప్పుడు ప్రజలు తాగునీరుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు మండల సమావేశంలో తెలియజేయడంతో తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మీసాల చిన్నప్పలనాయుడు, సన్యాసప్పడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని వినతి



రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గజపతినగరం: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు స్టేషన్ మేనేజర్ మూర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రైల్వే లైన్లు ఆధునికీకరణ చేయడంతో ఈ స్టేషన్‌లో అన్ని రకాల ట్రైన్లు ఆగేలా చూడాలని కోరినట్లు చెప్పారు. దీని వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరగడంతో పాటు రైల్వే ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, బాలాజీ, త్రినాథ తదితరులు ఉన్నారు.

పూరిల్లు దగ్ధం

వేపాడ: మండలంలో కొండగంగుబూడి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్.సన్యాసికి చెందిన ఇంట్లో రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. వాటిని ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇంట్లో ఉన్న సామానులు, విద్యుత్ ఉపకరణాలు పూర్తిగా కాలిపోయాయని, సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం వుంటుందని చెబుతున్నారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి

• ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తవలస: మండల పరిషత్ భవనంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా భూముల రీసర్వేలో లోపాలు ఉన్నాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చిన్నరావుపల్లి సర్పంచ్ బూసాల దేముడు ప్రస్తావించారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రీసర్వేపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే వచ్చేవారంలో మండలంలో సామూహిక గృహ ప్రవేశాలను నిర్వహిస్తామని, అందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, వైస్ ఎంపీపీలు మేలాస్త్రీ సరస్వతి, కర్రి శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, ఎంపీడీఓ వై.పద్మజ పాల్గొన్నారు.

ఊర్లోనే సూపర్ స్పెషాలిటీ వైద్యం



చీపురుపల్లి: కొత్త అగ్రహారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



ఎస్.కోట: వీరనారాయణం గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగి పరిస్థితిపై డాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు



జామి: భీమసింగి ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గొర్లె సరయు



లక్కవరపుకోట: రంగరాయపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం కొండపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మెంటాడ: గజపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న తహసీల్దార్ అరుణ, తదితరులు

ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో రోగులకు శిబిరాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ రఘురాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వైద్య శిబిరాలను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: ఆనందపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి వైద్య సేవలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సందీప్



బొండపల్లి: కొండకిండాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ చలంనాయుడు, తదితరులు



వేపాడ: వల్లంపూడిలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు



మెరకముడిదాం: కొర్లాం ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గంట్యాడ: సిరిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నరసింహమూర్తి

పేదల సంతోషమే సీఎం జగన్ లక్ష్యం

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: పేదల సంతోషం, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీనివాసరావు గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ లబ్ధిని తెలియజేసే బుక్‌లెట్లు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, చేతివృత్తులవారు ఇలా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే మీరంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిన పెత్తందారులైన ప్రతిపక్ష పార్టీల నాయకులు సిగ్గులేకుండా ఊళ్లలోకి వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జామి మండల కన్వీనర్ గొర్లె రవి, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, జేసీఎస్ ఇన్‌చార్జ్ వాకాడ సతీష్, షేక్ రహ్మాన్, పోతనాపల్లి, వీఆర్‌పేట సర్పంచ్‌లు కె.వెంకటరావు, మంచిన శివకోటి, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, స్థానిక నాయకులు ఎర్రపాటి సూర్యనారాయణ, ఆర్.వెంకటరమణ, వై.గణేష్, ఎం.రఘు, ఎం.రామారావు, పి.అప్పారావు, టి.శ్రీను, బోదల అక్కుబాబు, భీమవరపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీనివాసరావు బుధవారం భూమిపూజ చేశారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కింద సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నుంచి సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి రోడ్డును వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒబ్బిన త్రినాధమ్మ, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, ఎల్.కోట జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, ఎంపీటీసీ పడాల ధర్మారావు, పిల్లా వెంకటరావు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మిగా అమ్మవారు

బొండపల్లి, జామి: శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం దుర్గాదేవి అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. బొండపల్లి మండలం దేవుపల్లిలో రాజరాజేశ్వరి అమ్మవారిని లక్ష రూపాయలు విలువైన నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే జామి, భీమసింగి కనకదుర్గమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణగా..

చీపురుపల్లి పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమార్చనలు, ఛండీహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



జామి: అలమండలో లక్ష్మీదేవి అలంకరణలో దుర్గామాత



చీపురుపల్లి: అన్నపూర్ణదేవి అలంకరణలో శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారు

అగ్నిప్రమాదాలపై అవగాహన

గజపతినగరం: అగ్నిప్రమాదాలు సంభవించేటప్పుడు ఆందోళనకు గురికాకుండా అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించొచ్చని అగ్నిమాపక శాఖ అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ సూచించారు. స్థానిక సాయి ఫార్మసీ కళాశాల విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, వంటగ్యాస్, ఇతర కారణాలతో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వాటిని ఎలా అదుపుచేయాలో డెమో ప్రదర్శించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి కె.వినోద్‌కుమార్, అధ్యాపకులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గంట్యాడ: సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షత మండల పరిషత్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్మాణాలు పూర్తయిన భవనాలను ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వసాది, రామభద్రపురం సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇప్పటికే 8 సార్లు మార్చారని, ఇప్పుడు మళ్లీ అతన్నే వేశారని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అతన్ని వెనక్కి పంపించేయాలని విద్యుత్‌శాఖ ఏఈ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. డి.కె.పర్తి గ్రామంలో విద్యుత్ వైర్లు పాడైనట్లు సర్పంచ్ తెలియజేయగా.. వెంటనే కేబుల్ మార్చాలని ఏఈని ఎమ్మెల్యే ఆదేశించారు. వ్యవసాయం, విద్యుత్, విద్య, పంచాయితీరాజ్, ఉపాధిహామీ, ఇరిగేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గ్రామైఖ్య సంఘ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే

ఇటీవల జాతీయ స్థాయి అవార్డు సాధించిన గంట్యాడ గ్రామైఖ్య సంఘం సభ్యులను ఎమ్మెల్యే అప్పలనరసయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ కిలపర్తి వెంకటలక్ష్మి, ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ నీలకంటేశ్వర రెడ్డి, నారాయణమూర్తిరాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

'నా భూమి–నా దేశం'

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కాలేజీలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ముల్లు పైడిరాజు, రెడ్డి జగదీష్, శ్రీనివాసా కళాశాల డైరెక్టర్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకుంటాం..

దత్తిరాజేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పూర్తయిన వెంటనే దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి భాస్కరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ముగిసిన వెంటనే స్థానిక పీహెచ్‌సీని సందర్శించి అక్కడి వైద్యులతో, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యులు ఆనంద్‌కుమార్, సతీష్‌కుమార్ కొద్ది రోజులు క్రితం రోగుల ముందే వాగ్వాదం చేసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

వేపాడ: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ సత్యవంతుడు కోరారు. వల్లంపూడిలో రైతులకు కషాయాల తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగం వల్ల సాగుఖర్చు పెరగడంతో పాటు భూసారం కోల్పోతుందన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన సేవలు

చీపురుపల్లి: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఖజానాశాఖ నుంచి మెరుగైన సేవలు అందించనున్నట్లు జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి(ఎఫ్ఏసీ) ఆర్ఏఎస్ కుమార్ చెప్పారు. చీపురుపల్లి పట్టణంలోని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీఓ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

దత్తిరాజేరు: మండలంలో గత కొద్ది రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. దత్తిరాజేరులో ఎండిపోతున్న వరి పంటను జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు బుధవారం పరిశీలించారు. అనంతరం ఏఓ అనురాధతో కలిసి ఆయన మాట్లాడుతూ.. పంట పొట్టదశ, పూతదశలో ఉన్నందున రైతులు పంటను కాపాడుకునేందుకు మల్టీ కే పౌడర్‌ను ఎకరాకు 2 కేజీలు చొప్పున వేసుకోవాలని సూచించారు.

తాగునీటి బోరు మరమ్మతులు

కొత్తవలస: మండలంలోని పాతసుంకరపాలెంలో చాలా కాలంగా తాగునీటి బోరు పాడవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. బోరు బాగుచేయాలని ఎన్నిసార్లు సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతో గ్రామానికి చెందిన శ్రీసిద్ధి వినాయక యువజన సంఘం సభ్యులు సొంత డబ్బులతో బోరు బాగు చేసేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. గ్రామంలో ఉన్న మెకానిక్ సాయంతో బోరు బాగు చేసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో యువజన సంఘం సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

గడపగడపకూ సంక్షేమం



మెరకముడిదాం: కొర్లాంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గుర్ల: సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, నాయకులు

మెరకముడిదాం: రాష్ట్రంలోని ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, జంపన సావిత్రి అన్నారు. మండలంలోని కొర్లాం గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని, అందుకు ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రత్నం, తహసీల్దార్ విజయభాస్కర్, ఏఓ శ్రావణితేజ, ఏఈ హరికృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

గుర్ల: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు కోరారు. మండలంలోని వల్లాపురంలో రెండో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అర్హులైనా వారిందరికి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, ఎంపీడీఓ కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు ఇటకర్లపల్లిలో..

చీపురుపల్లి: మండలంలోని ఇటకర్లపల్లి గ్రామంలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం..

• కలెక్టర్ నాగలక్ష్మి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

దత్తిరాజేరు: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'జగనన్నకు చెపుదాం' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 69 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటన్నింటికీ పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు పనులకు టెండర్లు పిలవడం జరిగిందని, అవి ఖరారు కాగానే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. దళితుల కోసం శ్మశానవాటికలు నిర్మించాలని నాలుగు గ్రామాలకు చెందిన దళితులు అధికారులను కోరారు. అలాగే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పిల్లల స్కూల్ ఫీజులో రాయితీలు ఇవ్వాలని మండలంలోని జర్నలిస్టులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. తొలిసారిగా జిల్లా కలెక్టర్ మండల పరిషత్ కార్యాలయానికి రావడంతో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ ఆమెకు స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం ఆమెకు జ్ఞాపిక అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకటత్రివినాగ్, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో ఉన్న సత్య ఫంక్షన్ హాల్ ఆవరణంలో గురువారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

21న ఎస్.కోటలో..

కొత్తవలస: లక్కవరపుకోట మండలం సంతపేట జంక్షన్ సమీపంలో ఉన్న శాంభవి లేవుట్‌లో ఈ నెల 21న వైఎస్సార్‌సీపీ ఎస్.కోట నియోజకవర్గ స్థాయి నేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు ముఖ్యఅతిథిలుగా హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.